
# చదువు

## టి.శ్రీవల్లీ రాధిక




**బస్** కదలగానే సీట్లో వెనక్కి వాలి కూర్చున్నాను. ఇప్పుడు వెళ్లబోతున్న ఊర్లోనే పుట్టాను నేను ఇరవై ఏళ్ల క్రిందట.

నా చిన్నప్పుడు చాలాసార్లు ఇక్కడికి వచ్చాను కూడా.

"ఈ ఊరు..., అందులోని పెద్ద ఇల్లూ, తోటలూ, ఆ తోటల్లో పడి మేము ఆడుకున్న ఆటలూ..." పదేళ్ల క్రిందటి ఆ అనుభూతుల్లో ప్రతి చిన్న విషయమూ గుర్తుంది నాకు.

ఒళ్లు పులకరింపచేసే అమ్మమ్మ ప్రేమ, నోరూరించే సీతాఫలాలు, చెరకుగడలు...

... తాతయ్య కోపం కూడా. నిజం చెప్పాలంటే మిగిలిన వాటన్నిటి కంటే అదే బాగా గుర్తుంది. అసలు తాతయ్య కోపం తల్చుకుంటే ఇప్పటికీ కూడా వణుకొస్తుంది నాకు.

బాగా చిన్నతనంలో నైతే - "తాతయ్యకి కోపం వస్తుంది" అంటూ నన్ను ఎవరైనా భయపెడితే నేను ఆశ్చర్యపోయేదాన్ని "నాతో ఇంత ప్రేమగా కబుర్లు చెప్పే తాతయ్యకి కోపం వస్తుందా! కాని.

కానీ ఆ తరువాత్తరువాత తెలిసింది నాకు తాతయ్య కోపం ఎంత భయంకరంగా ఉంటుందో!

అప్పట్లోనే ఒక రోజు రాత్రిపూట మే మందరం త్వరగా అన్నాలు తినేసి ముందు గదిలో ఆడుకుంటున్నాం. పెద్దవాళ్లంతా ఓ గదిలో కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు.

అమ్మమ్మ ఏమో తాతయ్యకి అన్నం పెడుతూంది - వెనకవైపు వరండాలో. అప్పుడు ఒక్కసారిగా వినబడిన పెద్ద శబ్దానికి అందరం ఉలిక్కిపడి వెనకవైపు పరుగెత్తాం.

మేం వెళ్లేసరికి అక్కడ... తాతయ్య విసిరికొట్టిన కంచం వరండా అంతా భూచక్రంలా గిర్రున తిరుగుతోంది. అది విరజిమ్ముతున్న అన్నం వరండా దాటి, వంట గది వరకూ

చిందరవందరగా పడుతోంది.

మంచినీళ్ల గ్లాసు అరటిచెట్టు మొదట్లోకి వేగంగా విసిరేసే ముందు అమ్మమ్మ చేతిని ఓసారి పరామర్శించింది కాబోలు, అమ్మమ్మ మీద అంతా నీళ్లు చిమ్మినట్లు పడి ఉన్నాయి.

తాతయ్య తాపీగా వెళ్లి, బావి దగ్గర చేయి కడుక్కున్నాడు. ఆ తర్వాత వెళ్లిపోయి అప్పటికే అమ్మమ్మ వేసి ఉంచిన పక్కమీద పడుకున్నాడు. కాసేపటివరకూ ఎవరూ ఒక్క మాట కూడా మాట్లాడేందుకు సాహసించలేదు.

ఆ తరువాత మొదలయిన గుసగుసల్లో అర్థ మయింది. తాతయ్యకి అన్నంలో వెంట్రుక వచ్చిందనీ, ఒకసారి వస్తే అమ్మమ్మ తీసేసిందనీ, రెండోసారి రాగానే కంచం విసిరికొట్టి వెళ్లిపోయాడనీ...

బహుశా అప్పుడే అనుకుంటా చివరిసారి నే నీ ఊరు రావడం, మళ్లీ ఇన్నేళ్ల తర్వాత ఇప్పుడు.

నేను ఆలోచనల్లో ఉండగానే బస్ ఆగింది. ఒకే ఒక్క క్షణం ఆగిన బస్‌లో నుండి ఒంటరిగా దిగిన నేను ప్రశాంతంగా ఉన్న ఆ పచ్చని ప్రకృతిని పరవశంగా చూస్తూండిపోయా నో నిముషం.

తర్వాత రోడ్డు పవతలగా కనిపిస్తున్న జట్కా బండి వైపు అడుగులు వేశాను.

పచ్చని ప్రకృతి మధ్యగా పరుగులు పెడుతున్న బండిలో కుదుపులకి సర్దుకోవటానికి నాకు కొన్త టైం పట్టింది.

ఈ పల్లెటూర్లో, ఈ మట్టి రోడ్ల మీద జట్కా బండిలో ఒంటరిగా నేను ప్రయాణించడం... "కల కాదు కదా!" అనిపిస్తోంది.

ఇంతదూరం ఇలా ఒంటరిగా ప్రయాణించడం నా కిదే మొదటిసారి.

పైగా ఇన్నేళ్ల తరువాత వెళ్తుంటే, ఎంత అమ్మమ్మ వాళ్ల ఇల్లయినా కొంచెం బెరుకుగానే ఉంది.

నిజానికి అమ్మమ్మనీ, తాతయ్యనీ నేను చూడటం కంటే అమ్మ మాటల్లో విన్నదే ఎక్కువ.

తాతయ్య కోపంతో అమ్మమ్మ ఎన్ని అవస్థలు పడిందో కథలుగా చెప్తూంటుంది అమ్మ. ఎన్నెన్ని కథలో! ఎన్నెన్ని కష్టాలో! ఎలా గడిపిందో అమ్మమ్మ ఇన్ని సంవత్సరాలని . అనిపిస్తుంది నాకు.

ఏం చేస్తుంది భరించక? బయటకి వెళ్తే ఆదరించడానికి తనకి ఎవరూ లేరు. కనీసం చదువైనా లేదు. అయినా పల్లెటూర్లో పుట్టి, లోకజ్ఞానం లేకుండా పెరిగిన అమ్మమ్మకి అంత తెగింపు, ఆత్మవిశ్వాసం ఎలా వస్తాయ్!

ఇదివరకే అలా ఉండేదంటే ఇప్పుడు అమ్మమ్మకి చూపు కూడా బాగా తగ్గిపోయిందట. వయసూ పెరిగిపోయింది. ఇప్పుడు మరిం కెంత అవస్థ పడుతూందో!

తల వంచుకుని బాధగా ఆలోచిస్తున్న నేను "అదిగోనండి. అదే నాగభూషణంగారి ఇల్లు" అన్న బండి అతని మాటలకి తల ఎత్తి చూశాను.


దూరంగా కనిపించింది ఇల్లు. తాతగారు వరండాలోనే కూర్చుని ఉన్నారు. నిజంగా తాతగారేనా! ఎంత మారిపోయారు! సన్నగా, శరీర మంతా ముడుతలతో, కుర్చీలో ముడుచుకుని కూర్చున్న తాతయ్యని చూడగానే మనసు ఒక్కసారి ఉలిక్కిపడి ఆప్యాయతని ఫౌంటెన్‌లా చిమ్మిన ట్లయింది.

ఈ లోపల బండి అతను సూట్‌కేస్ లోపలికి తీసుకువెళ్తూ - "మామ్మగారూ! ఎవ రొచ్చారో చూడండీ!" అని అరిచాడు.

"ఎవరదీ?" అంటూ మెల్లగా లేచాడు తాతయ్య.

దొడ్లో బట్టలు ఆరేసుకుంటున్న అమ్మమ్మ కూడా - "ఎవరూ! వీరయ్యా!" అంటూ, గోడ పట్టుకుని నడుస్తూ వచ్చింది, కళ్లు చిట్లించి చూస్తూ.

బండి దిగి వా ళ్లిద్దరినీ చూస్తూ ఒక్క క్షణం అలా నిలబడిపోయిన నేను గబగబా నాలు గడుగులు వేసి, ఆవిడ చేయి పట్టుకుంటూ -




"నేను అమ్మమ్మా! మాధవిని" అనబోయాను.

ఈలోపల తాతయ్యే ఎలా గుర్తు పట్టాడో కానీ - "మాధవే, మన మాధవి వచ్చింది" అన్నాడు ఆనందంగా.

ఆవిడ నా భుజం మీద చేయి వేస్తూ - "ను వ్వటే! ఇదేవిటీ! ఎప్పు డొచ్చావ్! ఒక్కదానివే వచ్చావా!" అంది ఆశ్చర్యంగా, ఆప్యాయంగా.

బ్యాగ్‌లోంచి డబ్బులు తీసి వీరయ్యకి ఇచ్చి - "చెప్తా! చెప్తా!" అంటూ లోపలికి నడిచాను నేను.

** ** **

**ప్రయాణం** బడలిక తీరేలా హాయిగా స్నానం చేశాక, ముందు ఒకసారి పెరడంతా తిరిగి ఏమేం మొక్క లున్నాయో, ఏవి పూలు పూస్తున్నాయో చూసి వచ్చాను.

దొడ్లో గోరింటాకు చెట్టు, వాకిట్లో పారిజాతం పూలచెట్టూ, ఉత్తరం వైపు పచ్చ కనకాంబరాల చెట్టు - అన్నీ ఎక్కడి వక్కడే అలాగే ఉన్నాయి, చెక్కుచెదరకుండా. కాకపోతే ఒంటరిగా, దిగులు దిగులుగా... అచ్చు అమ్మమ్మ తాతయ్యల్లా ఉన్నాయి.

అన్ని మొక్కల్నీ ఒకసారి చూశాక మెల్లగా వచ్చి అమ్మమ్మ దగ్గర కూర్చున్నాను.

అమ్మమ్మ నన్ను చూడగానే మళ్లీ కుంపట్లో కాసిని బొగ్గులు వేసి వంట మొదలుపెట్టింది. కుంపటిలో నిప్పుల్ని చేత్తోనే అటూ ఇటూ కదిలిస్తున్న అమ్మమ్మని చిన్నప్పుడు చూసినట్లే అబ్బురంగా చూశాను నేను.

తాతయ్య కూడా వచ్చి మా దగ్గరే కూర్చున్నాడు, బాసింపట్టు వేసుకుని. అమ్మమ్మ వంట ముగించి పెరట్లోని అరిటాకులు రెండు తీసుకువచ్చి వడ్డించసాగింది.

అమ్మమ్మని చూస్తుంటే అసలు ఏ మాత్రం కనిపించడం లేదని అర్థ మవుతూనే ఉంది. కానీ, ఎన్నో సంవత్సరాలుగా అలవాటయిన పరిసరాలు కాబట్టి అన్ని పనులూ చేసుకోగలుగుతోంది.

"ఇం కెక్కడికైనా వెళ్తే అస లెందుకూ పనికిరాను" అంది తనే.

ఏమైనా, సరిగా కనబడకపోయినా అలాగే తడుముకుంటూ, కొసరి కొసరి వడ్డిస్తున్న అమ్మమ్మ ఆప్యాయతతో అన్నం అమృతంలా ఉందేమో నేను తాపీగా, సుష్టుగా తినే ప్రయత్నం చేస్తున్నాను.

తాతయ్య మాత్రం రెండు ముద్దలు చప్పరించి - "మజ్జిగ పోయవే" అన్నాడు.

అమ్మమ్మ మెల్లగా వెళ్లి మజ్జిగ గిన్నె తెచ్చింది.

అటే చూస్తున్న నాకు షాక్ తగిలిన ట్లయ్యింది.

నా గొంతులో అన్నం, చేతిలో ముద్ద, ఎక్కడి వక్కడే ఆగిపోయాయి. మరో చేతిలో ఉన్న గ్లాసులోని నీళ్లు వణికి తొణికాయి.

కారణం? విస్తట్లో పోయాల్సిన మజ్జిగని అమ్మమ్మ అతి పదిలంగా తాతయ్య తలమీద పోసింది.

అవి సున్నగా ఉన్న తాతయ్య గుండుపై పడి, అక్కడి నుండి పాయలుగా చీలి ముక్కుమీదగా, భుజాల మీదుగా, ముంజేతుల మీదుగా క్రిందికి జారుతున్నాయి గంగా ప్రవాహంలా.

ఇంత పెద్ద వయసులో అమ్మమ్మ అపరాధిలా శిక్షింపబడుతుందేమో అన్న ఆలోచన నన్ను స్థాణువును చేసింది.

నే నలా చేష్ట లుడిగి చూస్తుండగానే తాతయ్య - "ఏయ్. ఏయ్. ఏమిటే ఇది" అంటూ అరిచాడు.

ఈలోపల అమ్మమ్మకి అనుమానం వచ్చిందో, లేకపోతే పోసిన మజ్జిగ చాలనుకుందో కానీ, గిన్నె

వంచడం ఆపి నిలుచుంది.

తాతయ్య అమ్మమ్మ చేతిలోని గిన్నె లాక్కుని, తనే కాస్తంత మజ్జిగ పోసుకుని, గిన్నె అమ్మమ్మ చేతికి అందించాడు.

"ఏమిటండీ! ఏమైందీ!" అంది అమ్మమ్మ అయోమయంగా. తాతయ్య మాట్లాడకుండా విస్తట్లోని రెండు ముద్దలూ తినేసి లేచాడు.

నేను చెప్పాను మెల్లగా - "నువు మజ్జిగ తాతయ్య తలమీద ఒంపేశావు, అమ్మమ్మా!" అని. అమ్మమ్మ నివ్వెరబోయింది.

"అయ్యయ్యో!" అంటూ బావి దగ్గరకు వెళ్లింది కంగారుగా, తాతయ్యకు నీళ్లందించేందుకు.

నేను మాత్రం చాలాసేపటివరకూ ఆశ్చర్యంలో నుండి తేరుకోలేదు. తేరుకున్న తర్వాత అనుకున్నాను - "తాతయ్యకి కొద్దిగా కోపం తగ్గినట్లుంది" అని.

తాతయ్య వెళ్లి పడుకున్నాక అమ్మమ్మతో అన్నాను - "మరి ఇంత ఇబ్బందిగా ఉన్నప్పుడు, వంటరిగా ఇక్కడ ఎందుకు ఉంటారు, అమ్మమ్మా! మామయ్య వాళ్ల దగ్గరకి వెళ్లిపోవచ్చు కదా! తాతయ్య ఒప్పుకోడా!" అని.

"నా బాధ చూడలేక మీ తాతయ్య వెళ్దామనే అంటున్నారు. కానీ, అక్కడికి వెళ్తే, ఆ ఊర్లో మీ తాతయ్యకి ఏం తోస్తుంది చెప్పు!" అంది అమ్మమ్మ.

నేను కన్నార్పకుండా చూస్తూండిపోయాను. ఎందుకో ఇదివరకులా - "ఏమి టీ చాదస్తం!" అనిపించలేదు.

సాయంత్రం అవగానే - "ఈ ప్రక్కనే ఒకళ్లు పేరంటం పిలిచి వెళ్లారు. వెళ్దామా!" అని అడిగింది అమ్మమ్మ.

నేను హుషారుగా బయలుదేరి వెళ్లాను కానీ "ఏం పేరంటం!" అని అడగలేదు. అక్కడికి వెళ్లాక తెలిసింది, వాళ్ల అమ్మాయి పెద్ద దయిందట. అందుకు... పేరంటం.

నేను ఇలాంటివి ఎప్పుడూ చూడలేదు. విన్నా నంతే! 'అలా అందరినీ కూర్చోపెట్టి పేరంటం చేస్తే ఆ అమ్మాయికి సిగ్గుగా ఉండదూ, పాపం!' అనుకునేదాన్ని నేను ఇదివరకంతా. కానీ, ఈ పేరంటం చూశాక ఆ అభిప్రాయం మారిపోయింది. అలా సిగ్గుపడే పరిస్థితులేమీ లేవు ఇక్కడ.

అయినా నోరూరుకోక అడిగాను - "అమ్మమ్మా! ఇలా పేరంటం చేయడం వల్ల ఏమైనా ఉపయోగం ఉంటుందా! ఐ మీన్, దీనివల్ల జరిగే మంచి ఏ ముంటుంది చెప్పు!" అని.

అమ్మమ్మ నవ్వింది. "మంచో, చెడో మా కేం తెలుస్తుందే! ఈ పల్లెటూర్లో పుట్టాం. చదువూ, సంధ్యా లేకుండా పెరిగాం. పెద్దవాళ్లు ఏం చెప్పారో అది గుడ్డిగా ఆచరించడమే తప్ప, మీలాగా మే మెప్పుడూ ఆలోచించం" అంది.

నేను అవాక్కయి చూస్తుంటే మళ్లీ తనే అడిగింది - "అయితే ఏం! మేం ఆనందంగా లేమూ!" అని

నేను సమాధానం చెప్పలేదు. నా 'చదువు'ను చూసి నేను గర్వపడుతున్నట్లే, తన 'చదువు'ను చూసి తాను గర్వపడుతోంది అమ్మమ్మ.


పేరంటంలో అమ్మమ్మ పాటలు పాడింది. అమ్మమ్మ అంత బాగా పాడుతుందని నాకు తెలీదు. ప్రతి పేరంటానికీ ప్రత్యేకంగా పాట లుంటాయని కూడా నా కప్పుడే తెలిసింది.

ఇంటికి వచ్చాక - "అమ్మమ్మా! ఇందాక పాడిన పాటలు పాడతావా! నేను రికార్డ్ చేసుకుంటాను" అని అడిగాను.

అమ్మమ్మ మొదట సిగ్గు పడింది. నేను బ్రతిమలాడడంతో "సరే. మీ తాతయ్యని పడుకోనీ" అంది.

తాతయ్య పడుకున్నాక అమ్మమ్మా, నేనూ దొంగల్లాగా, మెల్లగా వాకిట్లోకి చేరాం.

ఆ చల్లని వెన్నెలలో, పారిజాతాల సువాసన పీలుస్తూ, అమ్మమ్మ పాటలు వింటుంటే కలిగిన




తన్మయత్వం... బహుశా అది నా జీవితంలో కెల్లా అద్భుతమైన అనుభూతి కావచ్చు:

మొత్తానికి తాతయ్యకి మెలకువ రాకుండా పని పూర్తి చేసుకున్నందుకు ఆనందిస్తూ, అమ్మమ్మని తీసుకుని లోపలికి వెళ్లబోయిన నేను...

అక్కడ వరండాలో, చీకట్లో కూర్చున్న తాతయ్యని చూసి అసంకల్పితంగా పెద్ద కేక పెట్టాను. తాతయ్య మాత్రం మెల్లగా కుర్చీలో నుంచి లేస్తూ - "నేనేనే! పాటలు విందామని కూర్చున్నా. మీ అమ్మమ్మ ఇంత బాగా పాడుతుందని నా కింతవరకూ తెలీనే తెలియదు" అన్నాడు.

తాతయ్య గొంతులో వినబడిన సంబరానికి నేను విస్తుపోయాను. నేను ఊహించిన దేమిటి? చూస్తున్న దేమిటి? తాతయ్యలోని మార్పుకు కారణం... అవసరమా! ఇం కెన్నాళ్లో బ్రతకను అన్న భయమా! ఏమో! ఏదీ తర్కానికి నిలబడటం లేదు.

ఆలోచనలతోనే రాత్రంతా గడిపేసిన నాకు తెల్లవారుజామున ఎప్పుడో కొద్దిగా నిద్ర పట్టింది. అంతలోనే అలికిడికి మెలకువ వచ్చేసింది.

వచ్చేటప్పుడు - ఒక్క రోజు ఉండి వెళ్దాం అనుకుంటూ వచ్చాను కానీ, ఇప్పుడు అసలు వెళ్లా లనిపించడం లేదు. కానీ ఎలా! స్నేహితురాలి పెళ్లి అని వచ్చి ఇక్కడ కూర్చుండిపోతే ఎలా!

ఒక రెం డ్రోజులు ముందు వచ్చి ఉంటే ఎంత బాగుండేది! ఆ పల్లెటూర్లో ఏం తోస్తుంది! అనుకున్నాను అప్పుడు పిచ్చిమొహంలా.

ఆలోచిస్తూ పెరట్లో కూర్చున్న నన్ను చూసి - "ఇంక లేచి స్నానం చేయి. బస్సుకి వేళ అవుతోంది" అంది అమ్మమ్మ.

నేను లేచి నిలబడ్డాను. వాళ్ల ఒంటరితనం చూస్తుంటే నాకు దిగులు వేస్తోంది. కానీ చేసే దేముంది! చిన్నగా నిట్టూర్చి బాత్‌రూంలోకి వెళ్లాను.

నే నలా వెళ్లానో, లేదో... బయట నుంచి పెద్ద శబ్దం, అమ్మమ్మ బాధగా అరిచిన అరుపు వినిపించింది.

అమ్మమ్మ గదిలో ఉన్న మంచం ఇవతలికి తేబోయినట్లుంది. తాను క్రింద పడి, మంచం తనమీద పడేసుకుంది. తాతయ్య వచ్చి మెల్లగా లేపి లోపలికి తీసుకువెళ్తున్నాడు.

నేను గబగబా స్నానం ముగించి, ఆయింట్‌మెంట్ తీసుకుని వెళ్లేసరికి తాతయ్య అమృతాంజనం తేవడం, దాన్ని అమ్మమ్మ కాలికి పూసి 'రిపేర్' చేయడం అయిపోయింది.

"పదండి. మీకు కాస్త హార్లిక్స్ ఇస్తాను" అంటోంది అమ్మమ్మ.

"నువు కాసేపు కూర్చోవే" అంటున్నాడు తాతయ్య.

నేను పెదవులపై నవ్వు, కళ్లలో నీరు మెరుస్తూండగా ఇవతలికి వచ్చేశాను.

**నాకు అర్థ మయింది. వాళ్లకి ఇప్పుడు ఎవరి అవసరమూ లేదు. వాళ్ల లోకం వాళ్లది. వాళ్ల జీవితం వాళ్లది.**

అది తెలిశాక నేను చకచకా రెడీ అయిపోయాను. వీరయ్య బండి వచ్చి ఆగింది వాకిట్లో. అది కదిలేవరకూ జాగ్రత్తలు చెపుతూనే ఉన్నారు ఇద్దరూ.

తండ్రి మాట కోసం అడవులకి వెళ్లిన రాముడి గురించీ, 'సత్యం' కోసం కష్టాలు పడిన హరిశ్చంద్రుడి గురించీ నేను చిన్నప్పుడు చదువుకున్నాను. కానీ మంచో, చెడో ఒక సిద్ధాంతాన్ని గుడ్డిగా నమ్మడం అనేది మనిషికి ఎంత శక్తి నిస్తుందో, అందులో గెలుపు మ రింకెంత అద్భుతంగా ఉంటుందో... నా కిప్పుడే అర్థ మయింది.

"తెలివితేటలు లేకపోవడం వల్లనే కావచ్చు; మేము పెద్దవాళ్లు చెప్పిన సిద్ధాంతాలు గుడ్డిగా నమ్ముతాం. అయితేనేం ఆనందంగానే ఉన్నాం" అన్న అమ్మమ్మ మాటలు మననం చేసుకుంటూ... నన్ను బస్ ఎక్కించి కనుమరు గయిపోతున్న వీరయ్యనీ, వెనక్కి పరుగెడుతూన్న ఆ పల్లెటూరినీ చూడలేక, కళ్లు మూసుకుని సీట్‌లో వెనక్కు వాలాను. ★